నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శాలిబండ: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివా ర ం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫ రాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రిన్స్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 9.30 గంటల వరకు, ఎస్సార్టీ కాలనీ, నందిముస్లాయిగూడ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగు బిలాల్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 10. 30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం

డబీర్‌పురా: కోమటివాడిలోని రామాలయంలో ఈ నెల 6న శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలతో పాటు సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

11న నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం సర్వసభ్య సమావేశం

నాంపల్లి: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర స్థాయి సర్వ సభ్య సమావేశం ఈ నెల 11న శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు పబ్లిక్‌గార్డెన్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరుగుతుందని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ ఇటీవల పదవీ విరమణ చెందారని, ఈ నేపథ్యంలో కేంద్ర సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, ప్రాజెక్టు సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరుకావాలని కోరారు. మీరిచ్చే సలహాలు, సూచనలు భవిష్యత్తు కార్యాచరణకు తోడ్పాటును అందిస్తాయని తెలిపారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బైస దేవదాస్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఉదయ సాహితి తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి కళా మాదవి రచించిన నవ్వండహే పుస్తకావిష్కరణ సభ శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నేటి నిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాస్ మాట్లాడుతూ..బాలల హాస్య నాటికల పుస్తకాన్ని తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. ఇటువంటి హాస్యభరిత పుస్తకాల అవసరం ఎంతగానో ఉందని రాబోయే రోజుల్లో మరిన్ని పుస్తకాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి కొండపల్లి నిహారిణి, విశ్రాంత ఆచార్యులు కె.అరుంధతి, ఉదయ సాహితీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ద్యాసం సేనాధిపతి, ఉప్పులూరి శ్రీరామచంద్ర మూర్తి, సమ్మెట విజయ, తులసి వెంకట రమణచార్యులు తదితరులు పాల్గొన్నారు.

డబీర్‌పురా ఫ్లై ఓవర్‌పై కుంగిన రోడ్డు



డబీర్‌పురా: నగరంలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పాతబస్తీ డబీర్‌పురా ఫ్లై ఓవర్ పైనున్న రోడ్డు కుంగింది. దీంతో ఈ దారిలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు పోలీసులు, స్థానికులు ట్రాఫిక్ కోన్లను ఏర్పాటు చేశారు. కుంగిపోయిన గుంత కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడకముందే సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం



అఫ్జల్‌గంజ్: ఈ నెల 6న ధూల్‌పేట నుంచి నిర్వహించే శ్రీరామనవమి పాల్కీ శోభాయాత్రకు రావాలని ఎమ్మెల్సీ కవితకు నిర్వాహకులు ఆనందసింగ్, పప్పుమాత్రే, శ్రీనివాస్, సౌరబ్ ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆదివారం ధూల్‌పేట్ నుంచి వేలాది మందితో పాల్కీ శోభాయాత్ర చేపడుతున్నట్లు వివరించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా దేవతామూర్తుల విగ్రహాలు పాల్కీ యాత్రలో ఏర్పాటు చేసి యాత్ర కొనసాగిస్తామన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న డాక్టర్ భగవంత్‌రావు, గోవింద్‌రాఠి తదితరులు

అబిడ్స్: శ్రీరామనవమి శోభాయాత్రను విజయవంతం చేద్దామని, ఇది రాజకీయ కార్యక్రమం కాదని, సనాతన ధర్మాన్ని కాపాడేందుకు అందరూ కలిసి సమష్టిగా జరుపుకునే ఉత్సవమని భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి అధ్యక్షుడు డాక్టర్ భగవంత్‌రావు అన్నారు. ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సిద్దింబర్ బజార్‌లోని బహెతీభవన్‌లోని ఉత్సవ సమితి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి గోవింద్‌రాఠితో కలిసి ఆయన మాట్లాడారు. ఈ నెల 6న శ్రీరామనవమిని పురస్కరించుకొని తొలుత సీతారాంబాగ్ ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. అనంతరం శోభాయాత్ర మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమై బోయిగూడ కమాన్, మంగళ్‌హాట్, జాలిహనుమాన్, పురానాపూల్, జుమ్మెరాత్‌బజార్, చుడీబజార్, బేగంబజార్ ఛత్రి, బర్తన్‌బజార్, సిద్దింబర్‌బజార్, గౌలిగూడ, పుత్లీబౌలి మీదుగా సుల్తాన్‌బజార్ వద్ద జరిగే బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. ఈసారి శోభాయాత్రకు ముఖ్యఅతిథిగా యూపీకి చెందిన అనంతశ్రీ విభూతిత్ స్వామి ఆథోక్షజానానంద్ దేవ్ తీర్థ జీ మహారాజ్ (గోవర్దన్ పీఠ్), త్రిపుర రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ శ్రీరామ్ ప్రసాద్ పాల్ పాల్గొని బేగంబజార్ ఛత్రి, సుల్తాన్‌బజార్‌లలో ప్రసంగిస్తారని వివరించారు. శోభాయాత్రలో పాల్గొనే భక్తులు శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకొని హైందవ సంస్కృతిని, జాతీయ ఐక్యతను చాటి చెపుతూ ఉత్సాహంతో ముందుకు సాగాలని కోరారు. 2010 నుంచి నిర్వహిస్తూ వస్తున్న ఈ శోభాయాత్ర అనాతి కాలంలోనే జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని గడించిందన్నారు. ఇక ఎమ్మెల్యే రాజాసింగ్ నిర్వహించే శోభాయాత్ర అంశాన్ని విలేకరులు ప్రశ్నించగా ఆయన ఎమ్మెల్యే కాకముందు తమతోనే పాల్గొనేవారని, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత విడిగా నిర్వహిస్తున్నా తమకేమీ అభ్యంతరం లేదన్నారు. చట్టానికి లోబడి శోభాయాత్రలో డీజేలకు బదులు సౌండ్ సిస్టమ్‌లను పెట్టాలని పోలీసుల వినతి మేరకు ఉత్సవ సమితి నిర్ణయించిందని డాక్టర్ భగవంత్‌రావు, గోవింద్‌రాఠిలు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉత్సవ సమితి నేతలు కరోడిమల్, మెట్టు వైకుంఠం, శ్రీరామ్‌వ్యాస్, మహేందర్‌వ్యాస్, మమతా గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించాలి


మాట్లాడుతున్న సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల

గన్‌ఫౌండ్రీ: సాంస్కృతిక సారథి కళాకారులు ప్రభుత్వ పథకాలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించాలని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ జి.వెన్నెల అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జిల్లా పౌర సంబంధాల అధికారుల సమన్వ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మానస పుత్రిక పథకాలైన ఆరు పథకాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకునేలా అధికారులు శ్రద్ధ చూపాలని కోరారు. సాంస్కృతిక సారథి కళాకారులు ప్రతినెలా 25 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలని అందు కోసం ముందుగానే కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. డీపీఆర్‌ఓ, కళాకారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. కళాకారుల కార్యక్రమాలపై డీపీఆర్‌ఓలు పర్యావేక్షణ ఉంటుందని తెలిపారు. సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హరీష్ మాట్లాడుతూ..కళాకారులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. సాంస్కృతిక సారథి కళాకారులు తమ కార్యక్రమాలను ప్రతి జిల్లా నుంచి ప్రతిరోజూ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సమాచార శాఖ అదనపు డైరెక్టర్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

తిరు కల్యాణ మహోత్సవాలు ప్రారంభం


లలిత సహస్రనామం చదువుతున్న మహిళలు

చాంద్రాయణగుట్ట: లలితాబాగ్ మల్లిఖార్జుననగర్ శ్రీ విఘ్నేశ్వర సాయిధామం ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. శ్రీ సీతారామచంద్ర స్వామి 24వ తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా తొలిరోజు మహిళా భక్తులు లలిత, విష్ణు సహస్రనామాల సామూహిక పారాయణం పఠించారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ పరిసరాలలో శ్రీరాముడి భారీ ఫ్లెక్సీలను అమర్చారు. కమిటీ చైర్మన్ మిద్దెల చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ మునిగంటి సుశీల్ కుమార్ చారి, అధ్యక్షుడు బొడ్డు వెంకటేష్, కోశాధికారి గుండు శ్రీకాంత్, యూత్ కమిటీ అడ్వయిజర్ వీరబోయిన శివకుమార్, పూజారీ గుర్రం బొజ్జన్న పంతులు పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

హకీంపేట్‌లో బల్దియా కమిషనర్ పర్యటన


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ఇలంబర్తి


గోల్కొండ: అభివృద్ధి పనుల్లో అధికారులు జాగ్రత్తగా ఉండాలని బల్దియా కమిషనర్ ఇలంబర్తి అన్నారు. గురువారం కురిసిన భారీ వర్షాల ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. హకీంపేట్‌లోవర్షపునీరు, మట్టి, ఇతర వ్యర్థాలు కొట్టుకువచ్చిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వరద నీరు ఈ ప్రాంతంలో ఎక్కడి నుంచి వచ్చిందని ఆయన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హకీంపేట్ ఎగువ ప్రాంతంలో హెచ్‌ఎండీఏ వారు చేపడుతున్న లేఅవుట్ తవ్వకాల కారణంగా మట్టి కొట్టుకు వచ్చిందని బల్దియా జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఆయనకు వివరించారు. తవ్వకాలలో వచ్చిన మట్టిని, రాళ్లను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. బల్దియా ఇంజనీరింగ్ విభాగం అధికారులు హెచ్‌ఎండీఏ అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతుండాలని అంతేకాకుండా మట్టి, కోతకు గురైన చెట్ల కొమ్మలను ఏరోజుకు ఆరోజు తొలగించే ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట బల్దియా ఎస్‌ఈ.రత్నాకర్ తదితరులు ఉన్నారు.

'పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందిస్తాయి'


వసంతోత్సవాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ లక్ష్మీ నారాయణ

నాంపల్లి: నవ్య సాహితీ సమితి, నవ్య నాటక సమితి సంస్థల సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం రాత్రి నాంపల్లిలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో వసంతోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి హాజరై వసంతోత్సవాన్ని ప్రారంభించారు. అదే విధంగా డాక్టర్ ఆచార్య ఫణీంద్ర రచించిన శ్రీ రామాయణ తారావళి దృశ్య కావ్యాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. పండుగలు మన సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ, స్నేహ సౌభ్రాతృత్వాలను పెంపొందింపజేస్తాయన్నారు. ఖజానా, గణాంకాల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర మాట్లాడుతూ..నవ్య సాహితీ సమితి, నవ్య నాటక సమితి సంస్థలు ఏ కార్యక్రమాన్ని చేపట్టిన విలక్షణంగా ఉంటాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తెలుగు వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీ శంకర్, నవ్య నాటక సమితి అధ్యక్షులు వేమరాజు విజయకుమార్, కార్యదర్శి ఆర్.ఎస్.సుధారాణి, నవ్య సాహితి సమితి కోశాధికారి యు.హెచ్.హరనాథ్‌బాబు, కార్యదర్శి మంకాల లక్ష్మీ మానస పాల్గొన్నారు. సభానంతరం ప్రముఖ కవులచే నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనం రసవత్తరంగా సాగింది. అలాగే వాసంతిక సాంస్కృతిక నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కళారత్న, మాధవీ మాల, బి.ఎస్.మేఖల, ధాత్రి పగడాల, యశశ్వినిలను సత్కరించారు.

నీటి తొట్ల ఏర్పాటు



చాంద్రాయణగుట్ట: మండుతున్న ఎండల్లో మూగ జీవాల దాహార్తీ తీర్చేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు పూల్‌బాగ్ చమాన్, వేంకటేశ్వర స్వామి ఆలయ పరిసరాలలో నీటి తొట్లను ఏర్పాటుచేశారు. గత కొన్ని రోజులుగా మూగ జీవాలు దాహార్తీ కోసం పడుతున్న ఇబ్బందిని గుర్తించిన బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.శైలేష్ కుమార్ జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు సానుకూలంగా స్పందించి కుక్కలు, పక్షుల సౌకర్యార్థం నీటి తొట్లను ఏర్పాటు చేయడంపై శైలేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. డప్పు అశోక్, మహేష్‌కుమార్, సుధాకర్, సాయి, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు


షేక్ ఇబ్రహీం

సంతోష్‌నగర్: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని శుక్రవారం నాంపల్లిలోని కోర్టు హాజరుపరచగా 12వ అదనపు సెషన్స్ జడ్జి టి.అనిత ఐదేళ్ల కఠిన జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం..ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2023 జూలై 15న ఇంటి ముందు ఆడుకుంటున్న మైనర్ బాలికను యాకుత్‌పురాకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ ఇబ్రహీం(50) తన ఆటోలో తీసుకెళ్లి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో నిందితుడు షేక్ ఇబ్రహీంను శుక్రవారం నాంపల్లిలోని కోర్టులో హాజరు సాక్ష్యాధారాలు, పూర్వ పరాలను పరిశీలించిన 12వ అదనపు సెషన్స్ జడ్జి టి.అనిత నిందితునికి ఐదేళ్ల కఠిన జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

కూతురిపై లైంగిక దాడి కేసులో తండ్రికి జీవిత ఖైదు

సంతోష్‌నగర్: కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని శుక్రవారం నాంపల్లిలో కోర్టు హాజరు పరచగా 12వ అదనపు సెషన్స్ జడ్జి టి.అనిత నిందితుడికి జీవితాంతం కఠిన కారాగార శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..హాఫీజ్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ మిస్బావుద్దీన్, రెహానా బేగంలకు 2004లో వివాహం జరిగింది. కాగా వీరికి ఒక కూతురు, కుమారుడు సంతానం ఉన్నారు. మిస్బావుద్దీన్ రెహానా బేగంకు 2007లో విడాకులు ఇవ్వగా..రెహానా బేగం తన పిల్లలతో కలిసి హుస్సేనీ ఆలంలోని తల్లిగారింటి వద్ద ఉంటుంది. అనంతరం మిస్బావుద్దీన్ ఫర్హానా బేగంతో రెండో వివాహం చేసుకోగా కూతురు పుట్టింది. 2014లో మిస్బావుద్దీన్ తన రెండో భార్య ఫర్హానా బేగంకు సైతం విడాకులు ఇచ్చాడు. తర్వాత మిస్బావుద్దీన్ తన మొదటి భార్య రెహానా బేగంతో మళ్లీ వివాహం చేసుకున్నాడు. వీరికి అబ్దుల్ రహమాన్ జన్మించాడు. కాగా 2020లో మరోసారి తల్లిదండ్రులు విడాకులు తీసుకున్నారు. దీంతో తల్లి రెహానా బేగం కూతురు, కుమారులు మిస్బావుద్దీన్ వదిలేసి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తండ్రి మిస్బావుద్దీన్ కూతురిపై లైంగిక దాడికి పాల్పడుతూ వీడియోలు తీస్తూ బెదిరింపులకు గురి చేశాడు. కాగా మైనర్ బాలిక గర్భవతి కాగా 2023 ఫిబ్రవరి 20లో అబార్షన్ చేయించారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కాగా ఈ కేసులో మహ్మద్ మిస్బావుద్దీన్‌ను శుక్రవారం నాంపల్లిలోని కోర్టు హాజరుపరచగా 12వ అదనపు సెషన్స్ జడ్జి టి.అనిత నిందితునికి జీవిత ఖైదుతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విజయనగర్‌కాలనీ: సైబర్ నేరాలపై విద్యార్థులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కాజోల్ జైస్వాల్, డీఎస్పీ మాధవి అన్నారు. శుక్రవారం మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియం హాల్‌లో ఎస్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రోజురోజుకూ సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త అంశాలతో ప్రజల ముందుకు వచ్చి వారిని మభ్యపెట్టి మోసగిస్తున్నారని పేర్కొన్నారు. వ్యక్తిగత సమాచారం తస్కరించుట, ఆర్థిక మోసాలు, హ్యాకింగ్, సైబర్ బుల్లీయింగ్, మాల్వేర్ దాడుల వంటి విభిన్న రూపాల్లో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగిస్తూ ఆర్థికంగా నష్టపోయేలా వివిధ పద్ధతుల ద్వారా నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాస్, యూనివర్సిటీ ఎస్‌ఎస్‌ఎస్ ప్రతినిధి ప్రొఫెసర్ హెచ్ చిన్న సైదులు, పూజ, రాధికలతో పాటు యూనివర్సిటీ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'మోదీ పాలనలో దేశానికి సుస్థిరత వచ్చింది'

గోల్కొండ: మోదీ పదేళ్ల పాలనలో దేశానికి సుస్థిరత వచ్చిందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. పార్లమెంటు ఉభయ సభల్లో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా శుక్రవారం ఆయన గుడిమల్కాపూర్ యార్డులో వ్యాపారులకు మోదీ విజయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశ పౌరులందరినీ ఏకతాటిపైకి తెచ్చిన ఘనత ప్రధాని మోదీదేనన్నారు. వక్ఫ్ బిల్లు సవరణతో ముస్లింలకు చెందిన ఆస్తులు ఒకే గొడుగు కిందకు వస్తాయని, ఈ ఆస్తులు కబ్జాకు గురయ్యే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఒకే దేశం, ఒకే చట్టం అన్న నినాదంతో మోదీ ముందుకు సాగుతున్నారని ఆయన పాలనలో దేశ ప్రజలందరికీ ప్రభుత్వంపై భరోసా ఏర్పడిందన్నారు. నాయకులు నామ యాదగిరి, శ్రీకాంత్ సాగర్ ఉన్నారు.

కార్పొరేటర్‌కు సన్మానం



గౌలిపురా: గౌలిపురాలోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మిని పారిశుద్ధ్య విభాగం సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ను పారిశుద్ధ్య కార్మికులు పూలమాలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌలిపురా డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఇ.సుమన్ కుమార్‌ముదిరాజ్, నాయకులు జి.రఘుకాంత్, కె.రాజ్ కుమార్, జమాల్‌పూర్ అశోక్, కె.ప్రేమ్‌రాజ్, బొట్టు వెంకట్, జి.వికాస్, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు రావాల్సిన 5 డీఏలు ఇవ్వాలి


మేయర్‌తో సమావేశమైన రాజేశ్వర్‌రావు, కృష్ణ

అఫ్జల్‌గంజ్: ఉద్యోగులకు రావాల్సిన 5 డీఏలు వెంటనే ఇవ్వాలని భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు జి.రాజేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి టి.కృష్ణలు డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంసీలో పర్మినెంట్ ఉద్యోగులందరికీ 150 గజాల ఇంటి స్థలాలు ఇవ్వాలని వారు పేర్కొన్నారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని కలిసి వారి సమస్యలు వివరించారు. అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించి ఉద్యోగులకు అండగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ..ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జనరల్ సెక్రెటరి రాధాకృష్ణ, నరేందర్ యాదవ్, పవన్, రసూల్, రాఘవేంద్ర, నరేందర్, లక్ష్మీకుమార్, శివశంకర్, ఆనంద్, యాదయ్య, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత దివ్యాంగ్ నిర్ధారణ, శస్త్ర చికిత్స


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: తెలంగాణలో దివ్యాంగుల సంక్షేమం కోసం నారాయణ్ సేవా సంస్థాన్ ఒక గొప్ప ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తుంది. ఏప్రిల్ 6న హైదరాబాద్ చంపాపేట్‌లోని మినర్వా గార్డెన్స్‌లో ఉచిత దివ్యాంగ్ నిర్ధారణ, శస్త్ర చికిత్స ఎంపిక నారాయణ్ లింబ్ కొలత శిబిరాన్ని నిర్వహిస్తుందని నారాయణ్ సేవా సంస్థాన్ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శిబిరానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను నారాయణ్ సేవా సంస్థాన్ హైదరాబాద్ ప్రతినిధులు అల్కా చౌదరి, భగవాన్ ప్రసాద్, యశ్వంత్ పటేల్, మహేందర్ సింగ్, రితీష్ జాగిర్దార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగుల సాధికారత, స్వావలంబనకు సంస్థ కట్టుబడి ఉందన్నారు. సంస్థ నుంచి అనుభవజ్ఞులైన ఆర్థోటిస్టులు, ప్రోస్థటిక్ వైద్యుల బృందం లబ్ధిదారులను పరీక్షించి అధిక నాణ్యత, తేలికైన, మన్నికైన నారాయణ్ కృతిమ అవయవాల కోసం కచ్చితమైన కొలతలు తీసుకుంటుందని వారు వివరించారు. ఈ కస్టమ్-మెడ్ కృత్రిమ అవయవాలను సుమారు రెండు నెలల తర్వాత నిర్వహించబడే ఫిట్‌మెంట్ శిబిరంలో ఉచితంగా అందిస్తారని తెలిపారు. శిబిరానికి మంత్రులను ఆహ్వానించామన్నారు. పాల్గొనాలనుకునే వారు తమ ఆధార్ కార్డు, వికలాంగ ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను తమ వైకల్యానికి రుజువుగా తీసుకురావాలన్నారు.

గోషామహల్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి


మేయర్‌కి వినతిపత్రం అందజేస్తున్న మమతాగుప్తా, సంతోష్‌గుప్తా

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, సంతోష్‌గుప్తా మేయర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ మేరకు గోషామహల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని మేయర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..జీహెచ్‌ఎంసీ తరపున, ప్రభుత్వ ఇతర శాఖల తరపున నియోజకవర్గం నలుమూలలా అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ఇంటింటా అందేలా పార్టీ కార్యకర్తలు, శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మమతా గుప్తా, సంతోష్‌గుప్తా మాట్లాడుతూ..మేయర్ విజయలక్ష్మి సహకారంతో నియోజకవర్గం నలుమూలలా ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ముందుంటామని పేర్కొన్నారు.


ముగిసిన నాంపల్లి కోర్టు బార్ ఎన్నికలు


సంబురాలు చేసుకుంటున్న గెలుపొందిన న్యాయవాదులు

సిటీ కోర్టులు: నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. శుక్రవారం జరిగిన ఈ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా ముగిశాయి. నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొత్తం 2019 ఓట్లు ఉండగా 1377 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికోసం ముగ్గురు అభ్యర్థులు డి.వెంకటేశ్, కె.రవి కిశోర్, మహమూద్‌ఖాన్ బరిలో ఉండగా 777 ఓట్ల తేడాతో రవికిశోర్ విజయం అందుకోగా రెండో స్థానంలో డి.వెంకటేశ్ నిలిచారు. కార్యదర్శి పదవికి వెంకటరమణ గౌడ్, ఆర్.వేణుగోపాల్ బరిలో ఉండగా 87 ఓట్ల తేడాతో రమణ గౌడ్ విజయం సాధించారు. అదేవిధంగా రెండు ఉపాధ్యక్షుల పదవుల కోసం ఆరుగురు అభ్యర్థులు అఫ్జలుద్దీన్, చంద్రమోహన్, దీపక్ కుమార్ శర్మ, నరేశ్ కుమార్, రవీందర్, శివప్రసాద్ పోటీలో నిలువగా చంద్ర మోహన్, దొంతుల రవీందర్ విజయం సాధించారు. లైబ్రేరియన్‌గా స్రవంతి, సంయుక్త కార్యదర్శిగా హృదయనాత్ ఆసూర్య, కోశాధికారిగా రవీందర్ నాయక్‌తో 8 ఎగ్జిక్యూటీవ్ కమిటీ మెంబర్లు ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గెలుపొందిన అభ్యర్థులు పెద్ద ఎత్తున సంబురాలు జరుపుకున్నారు.

టీఎన్జీఓస్ మెగా రక్తదాన పోస్టర్ ఆవిష్కరణ

అబిడ్స్: టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11న నిర్వహించే మెగా రక్తదాన శిబిరం పోస్టర్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆవిష్కరించారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని 11న గృహకల్ప భవన్‌లో టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. శుక్రవారం గడ్డం ప్రసాద్‌కుమార్‌తో పాటు టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేన్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్ ఈ ఆవిష్కరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, హరీష్, ఉస్మాన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేనీ

ఘనంగా శ్రీ సుదర్శన హోమం



చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా పూల్‌బాగ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ బొశెట్టి లెనిన్ బాబు ఆధ్వర్యంలో శ్రీ సుదర్శన హోమం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు కె.మోహనాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పి.వెంకటేశ్వర్ రావు, మురళీధర్, అమరేశ్వర్ రెడ్డి, శైలజ, ఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.